## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



hindustanmedia333@gmail.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దిన పత్రిక

సామాన్యుడి నేస్తం








ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 59 శనివారం జూన్ 27 2026, పేజీలు - 4 వెల :2/-


## రామ జన్మభూమి ట్రస్ట్ అవినీతి వ్యవహారంలో వాస్తవాలు చెప్పాల్సిందే: ఎంపీ చామల

హిందూస్థాన్ మీడియా, జూన్ 26:



అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ విరాళాల అవకతవకలపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్‌కు సంబంధించి ఎలాంటి అవినీతి జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారని.. కానీ యూపీ సిట్ పోలీసులు చంపత్ రాయ్ మనుషులను అరెస్టు చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని విరాళాలు వసూలు చేశారని అన్నారు. చంపత్ రాయ్‌ను ట్రస్ట్ కార్యదర్శి పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. యూపీ సీఎం పదవికి యోగి ఆదిత్య నాథ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇది యూపీకి సంబంధించిన వ్యవహారం కాదని.. దేశ ప్రజలకు సంబంధించిన అంశమన్నారు.

## డబ్బులు ఇవ్వకుంటే హాజరు తగ్గిస్తున్నారంటూ ఆవేదన

**-ఉపాధి కూలీలపై 'వారపు మామూళ్ల' భారం?**

**-రూ. 200 వసూలు చేస్తున్నారని ఆరోపణలు**

హిందూస్థాన్ మీడియా:

నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో ఉపాధిహామీ కూలీల నుంచి వారానికోసారిరూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మొత్తం చెల్లిస్తేనే పూర్తి కూలీ ఖాతాలో జమ అవుతుందని కొందరు చెప్పున్నట్లు కూలీలు చెప్తున్నారు. దీనిపై అభ్యం తరం వ్యక్తంచేసిన వారి హాజరును తగ్గిస్తున్నారని కూడా ఆరోపిస్తున్నారు. మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లపై ఒత్తిడితెచ్చి వసూళ్లు జరుగుతున్నాయన్న ప్రచారం స్థానికంగా సాగు తోంది. ఈవ్యవహారం మండలంలో చర్చనీయాంశమైంది.

**పని కంటే ఫొటోలకే ప్రాధాన్యమా?**

కొన్నిచోట్ల పని చేయకపోయినా ఉదయం, సాయంత్రం ఫొటోలు దిగితే సరిపోతుందని కూలీలు చెబుతున్నారు. ప్రతిగా వారానికి కొంత మొత్తం ఇవ్వాలని షరతు విధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పూర్తి కూలీ వస్తుందనే ఆశతో కొందరు కూలీలు కూడా ఇందుకు అంగీకరిస్తున్నట్లు తెలుస్తోంది. చెరువులు, కాలువలు, అటవీ ప్రాంతాల్లో జరిగే పనులను పర్యవేక్షించడం కష్టమవడం ఈ పరిస్థితికి కారణమవు తోందని అంటున్నారు. దీంతో పథకం అమలు పై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**రూ.కోట్లలో తిరుగుతున్న లెక్కలు**

వెబ్‌సైట్ గణాంకాల ప్రకారం లక్ష్మణచాంద లో ఈ ఆర్థిక సంవత్సరంలో 10,893మంది ఉ పాధి కూలీలున్నారు. ఒక్కోకూలీ నుంచి వారానికి రూ.300 చొప్పున వసూలు చేస్తే లక్షల్లో మొత్తం చేరుతుందని స్థానికులు చెబుతున్నారు. 100రోజుల పనిదినాల కాలానికి ఈ లెక్క రూ. కోట్లకు చేరే అవకాశముందని అంచనా వేస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ అవసరమని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

**ప్రశ్నించినందుకు హాజరు తక్కువ వేశారు**

**రవి, ఉపాధి కూలీ, లక్ష్మణచాంద**

వారానికి 200 ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించాను. దీన్ని మనసులో ఉంచుకుని నాహాజరు తక్కువగా వేశారు. అకౌంట్‌లో కూలి వేయకుండా సతాయిస్తున్నారు. ఈ విషయాన్ని ఏపీవో దృష్టికి తీసుకెళ్లాను. ఆఫీస్‌కు వచ్చి కలువాలని చెప్పారు. ఆఫీస్‌కు వెళ్తే నేను లేను మళ్లీ రా అన్నారు. ఆ తర్వాత ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయటం లేదు.

**అక్రమాలకు పాల్పడిన వారిని తొలగించాం..**

**ప్రమీల, ఏపీవో, లక్ష్మణచాంద**

కిందిస్థాయి సిబ్బంది కొంతమంది అక్రమాలకు పాల్పడింది వావస్తవమే. వారి ఇప్పటికే తొలగించాం. హాజరు తప్పుగా నమోదు అయినా, కూలి అకౌంట్‌లో పడకున్నా నా దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కస్తాను. అలాగే అక్రమాలకు పాల్పడిన వారి గురించి తగిన ఆధారాలతో వస్తే చర్యలు తీసుకుంటాం.

## తెలంగాణలో 13 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు

హిందూస్థాన్ మీడియా, జూన్ 26:




తెలంగాణ రాష్ట్ర పాలనా విభాగంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చేపట్టింది. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంటూ ఒకేసారి 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాజా బదిలీలలో భాగంగా ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను నియమించారు. అలాగే ఇప్పటివరకు సీఎంఓలో సేవలందించిన అజిత్‌రెడ్డిని అక్కడి నుంచి బదిలీ చేసి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొత్త బాధ్యతలను అప్పగించారు. జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమితులయ్యారు. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ అధికారులకు అదనపు బాధ్యతలను కూడా కేటాయించింది. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులు కాగా.. ఆయనకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించగా.. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. చేనేత, హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సవ్యసాచి ఘోష్‌కు ఆ శాఖలోనే మరికొన్ని అదనపు బాధ్యతలను కేటాయించగా.. అదే శాఖకు జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవిని నియమించారు. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే.. హెచ్ఎండీఏ (HMDA) జాయింట్ కమిషనర్‌గా కె. చంద్రకళను, తెలంగాణ రెడ్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించారు. ఆర్అండ్‌బీ (R&B) స్పెషల్ సెక్రటరీగా గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) కొత్త కమిషనర్‌గా టి.వెంకన్నను నియమించారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత కీలకమైన టూరిజం డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్‌ను నియమించారు.

**సీఎం ముఖ్య సలహాదారుగా కె. రామకృష్ణారావు నియామకం..**

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 30న పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రికి అడ్వైజర్ & ఎక్స్-ఆఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం. 912 జారీ చేసింది. పరిపాలనలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని వినియోగించుకునేందుకు రిటైర్మెంట్ రోజే ప్రభుత్వం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను విడిగా జారీ చేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: సీఎం రేవంత్

హిందూస్థాన్ మీడియా, జూన్ 26:



సమాజాన్ని డ్రగ్స్ నాశనం చేస్తాయి. డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వా ములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవు తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరిం చాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందు కు వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొం దించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్‌ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుంబిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## బాల్క సుమన్‌కు ధైర్యం చెప్పిన కేటీఆర్



హిందూస్థాన్ మీడియా, జూన్ 26:

దాదాపు నెల రోజుల పాటు జైల్లో ఉన్న చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ గురువారం సాయంత్రం చంచల్‌గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈరోజు ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సింగరేణి బొగ్గు గనులకు సంబంధించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదయింది. ఈ క్రమంలోనే ఆయనను అరెస్ట్ చేశారు. ఈ కేసుల వల్ల ఆయన ఏకంగా 27 రోజుల పాటు జైల్లో గడపాల్సి వచ్చింది. కేటీఆర్‌ను కలిసిన సందర్భంగా... తన జైలు అనుభవాలు, తదుపరి న్యాయపోరాటం గురించి చర్చించారు. ఈ కష్టకాలంలో పార్టీ తనకు అండగా నిలిచినందుకు కేటీఆర్‌కు థాంక్స్ చెప్పారు. బాల్క సుమన్‌ను కేటీఆర్ ఆత్మీయంగా హత్తుకుని, ధైర్యం చెప్పారు.

## చేర్యాలలో సాయి శివ ఫర్టిలైజర్ 'సబ్సిడీ యూరియా' భారీ కుంభకోణం: కాగితాల్లోనే అమ్మకాలు.. రూ. 17 లక్షల సబ్సిడీ సొమ్ము స్వాహా!

**- 6,429 యూరియా బ్యాగులు మాయం..**

**హోల్‌సేల్ డీలర్ల పాత్ర పై పోలీసుల ముమ్మర దర్యాప్తు వ్యవసాయ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీల్లో బాగోతం బట్టబయలు!**

చేర్యాల (హిందూస్థాన్ మీడియా):

వానాకాలం సాగు పనుల్లో అన్నదాతలు ఎరువుల కోసం అల్లాడుతుంటే.. చేర్యాల పట్టణంలో సాక్షాత్తూ ప్రభుత్వ సబ్సిడీ యూరియాను పక్కదారి పట్టించిన ఒక భారీ కుంభకోణం కలకలం రేపింది. రైతులకు అమ్మినట్లుగా నకిలీ కాగితాలు సృష్టించి, సుమారు రూ. 17,10,144/- (పదిహేడు లక్షల పది వేల నూట నలభై నాలుగు రూపాయలు) విలువైన ప్రభుత్వ సబ్సిడీ యూరియాను దారిమళ్లించిన వ్యవహారంలో చేర్యాల పోలీసులు అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**తనిఖీల్లో తేలిన నగ్నసత్యాలు.. అసలు ఏం జరిగిందంటే?**

చేర్యాల డివిజన్ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ టి. రాధిక ఇచ్చిన అధికారిక ఫిర్యాదు ప్రకారం.. జిల్లా వ్యవసాయ అధికారి సూచనల మేరకు చేర్యాల మండల వ్యవసాయ అధికారి భోగేశ్వర స్వామి ఈ నెల 09.06.2026 నాడు చేర్యాల పట్టణంలోని M/s శ్రీ సాయి శివ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. భౌతికంగా నిల్వలు శూన్యం: సదరు ఫర్టిలైజర్స్ దుకాణం గోదాంలో ఒక్క యూరియా బస్తా కూడా భౌతికంగా కనపడలేదు. రిజిస్టర్లలో మాయం: యూరియా నిల్వలకు సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని స్టాక్ రిజిస్టర్‌లో నమోదు (మెన్షన్) చేయలేదు. యాప్‌లో అక్నాలెడ్జ్‌మెంట్ లేదు: డీలర్ అయిన సందీప్ రెడ్డి 6,429 యూరియా బ్యాగులకు సంబంధించిన 22 టాక్స్ ఇన్‌వాయిస్‌లను e-POS మిషన్ నుండి అధికారిక 'ఫెర్టిలైజర్ యూరియా యాప్'కు అక్నాలెడ్జ్‌మెంట్ ధృవీకరించలేదు. యాప్ లింక్ మతలబు ఇదే: వ-్రూూ లో యూరియా ఇన్‌వాయిస్ అక్నాలెడ్జ్‌మెంట్ ధృవీకరించకపోతే, సాధారణ రైతులకు ఫెర్టిలైజర్ యాప్‌లో బుకింగ్ చూపించదు, తద్వారా వారు కొనుగోలు చేయలేరు. కానీ డీలర్ సందీప్ రెడ్డి మాత్రం రైతులకు 6,429 బ్యాగులు అమ్మినట్లుగా తప్పుడు కాగితపు బిల్లులు తయారు చేసి దందా నడిపారు. కేవలం e-POS లో మాత్రమే లావాదేవీలు చూపిస్తూ, భౌతిక బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు కేవలం కాగితాలపైనే సృష్టించారు.

**కుంభకోణం విలువ సబ్సిడీ వివరాలు:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి సాగు భారం తగ్గించేందుకు ఎరువులపై భారీగా సబ్సిడీలు ఇస్తున్నాయి. ఈ కుంభకోణంలో దోపిడీ జరిగిన తీరు ఇలా ఉంది: మాయమైన మొత్తం బ్యాగులు - 6429, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ ప్రతి సంచి పై - 2200/- నుండి 2500/-,రైతుకు నిర్ణయించిన ధర - 266/-, దారి మళ్ళిన సబ్సిడీ సొమ్ము - 17,10,144/-

**వ్యవసాయ శాఖ ప్రతిష్టకు భంగం పోలీసుల రంగప్రవేశం:**




ఈ అక్రమాలు చేర్యాల ప్రాంతంలోని అసలైన నిరుపేద రైతులకు సబ్సిడీ యూరియా అందకుండా చేయడమే కాకుండా, ప్రభుత్వ ఎరువుల పంపిణీ వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపాయి. దీనివల్ల సాగు పనులు ప్రారంభించే తరుణంలో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొనడంతో పాటు వ్యవసాయ శాఖ ప్రతిష్టకు భంగం కలిగింది. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపిన ఏడీఏ టి. రాధిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. 6,429 యూరియా బ్యాగుల మాయం వెనుక సదరు రిటైల్ డీలర్‌తో పాటు వీరికి ఎరువులు సరఫరా చేసిన హోల్‌సేల్ డీలర్లు అయిన వీ/o శ్రీ ఫర్టిలైజర్ ఆంజనేయ ఫర్టిలైజర్స్, సీడ్స్ & పెస్టిసైడ్స్, మరియు M/s శ్రీ గణేష్ ట్రేడర్స్ ల పాత్రపై కూడా పూర్తి స్థాయి దర్యాప్తు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ అధికారుల ఫిర్యాదు మేరకు చేర్యాల పోలీసులు నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, లోతైన దర్యాప్తు చేపట్టారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని శ్రీ మాడేలేశ్వర స్వామికి జలాభిషేకం

**-పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించిన యాదవ్ నగర్ వాసులు**

**చేర్యాల, జూన్ 26 (హిందుస్థాన్ మీడియా):** వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చేర్యాల మండల కేంద్రంలోని శ్రీ మాడేలేశ్వర స్వామి దేవాలయంలో యాదవ్ నగర్ కురుమ కులస్తులు శుక్రవారం జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, వరుణదేవుని కరుణించాలని కోరుతూ భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. శ్రీ మాడేలేశ్వర స్వామికి పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించి, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి



చెరువులు, కుంటలు నిండాలని, భూగర్భ జలాలు పెరిగి పాడిపంటలు పుష్కలంగా పండాలని ప్రార్థించారు. అలాగే రైతులు, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, ప్రకృతి అనుకూలించి వ్యవసాయం అభివృద్ధి చెందాలని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ జలాభిషేక కార్యక్రమంలో యాదవ్ నగర్ కురుమ కులస్తులు, గ్రామ పెద్దలు, రైతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సంఘాలను బలోపేతం చేయాలి

**-ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాలు నిర్వహించాలి: ఐఎఫ్‌టీయూ జాతీయ కన్వీనర్ షేక్షావలి**

**చేర్యాల, జూన్ 26 (హిందుస్థాన్ మీడియా):** ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజా సంఘాలను మరింత బలోపేతం చేసి, ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేపట్టాలని భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్‌టీయూ) జాతీయ కన్వీనర్ షేక్షావలి పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా చేర్యాలలో శుక్రవారం ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర కార్యదర్శి బానోతు సంతోష్ నాయక్ అధ్యక్షతన ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన షేక్షావలి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. దేశంలో పేద ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై ఐక్యంగా పోరాటాలు నిర్వహించి ప్రజా ఉద్యమాలను మరింత తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గోదావరి లోయ ప్రతిఘటన పోరాట నిర్మాత కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి సిద్ధాంతాలు, రాజకీయ ఆలోచనలను ప్రజా సంఘాల నాయకులు అవగాహన చేసుకుని ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అలాగే కేంద్ర ఎన్నికల కమిషన్ చేపడుతున్న ఓటరు జాబితా సర్వేపై ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. ప్రజల మౌలిక సమస్యలను పక్కదారి పట్టించే కుల, మత, ప్రాంతీయ విద్వేష రాజకీయాలను ప్రజలు



తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం (విముక్తి) కన్వీనర్ పీ. సునీత, బి. లలిత, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఇనుప సురేష్, చేర్యాల రైతు కూలి సంఘం కన్వీనర్ చిలక చంద్రన్న, చేర్యాల ఐఎఫ్‌టీయూ నాయకుడు గడిపే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత బహుజన ఫ్రంట్ మహాసభలను విజయవంతం చేయాలి

**-జిల్లా ప్రధాన కార్యదర్శి పోతరాజు శంకర్ పిలుపు**



**సిద్దిపేట, జూన్ 26 (హిందుస్థాన్ మీడియా):** దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 30న నిర్వహించనున్న మహాసభలను కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పోతరాజు శంకర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గజ్వేల్‌లోని కోలాభి రామ్ గార్డెన్‌లో నిర్వహించే మహాసభకు ముఖ్య అతిథిగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరుకానున్నారని తెలిపారు. దళిత, బహుజనుల సమస్యలు, హక్కులు, సామాజిక అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఈ మహాసభలో చర్చలు జరుగనున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని డీబీఎఫ్ కార్యకర్తలు, నాయకులు, దళిత బహుజన ప్రజలు అధిక సంఖ్యలో హాజరై మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు

## ఒక్క దొంగ ఓటు కూడా ఉండొద్దు.. కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి!

**-ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలన (SIR) ప్రక్రియపై మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి దిశానిర్దేశం**

**-చేర్యాల 7వ వార్డులో పర్యటన..**

**-అర్హులైన వారి ఓట్లు గల్లంతు కాకుండా చూడాలని పిలుపు**



**చేర్యాల (హిందూస్థాన్ మీడియా):** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ వ్యాప్తంగా సాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలన (SIR - Special Summary Revision) ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు (BLA), పార్టీ శ్రేణులు అత్యంత పటిష్టంగా వ్యవహరించాలని జనగామ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి గారు పిలుపునిచ్చారు. శుక్రవారం చేర్యాల పట్టణ కేంద్రంలోని 7వ వార్డులో జరుగుతున్న »SIR' ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ పోతుగంటి ప్రసాద్, బీఎల్ఏలు, ముఖ్య నాయకులతో కలిసి ఓట్ల నమోదు, తొలగింపు అంశాలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. గత పాలకులు జనగామ నియోజకవర్గంలో తమ రాజకీయ స్వార్థం కోసం, అడ్డదారిలో గెలవడం కోసం వేలాది దొంగ ఓట్లను నమోదు చేయించారని తీవ్రంగా ఆరోపించారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో అలాంటి అక్రమాలకు ఏమాత్రం తావుండకూడదని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో ఉన్న ఒక్క దొంగ ఓటును కూడా వదలకుండా గుర్తించి, వాటిని తొలగించేలా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై ఉందన్నారు.

**-అర్హులైన వారి ఓట్లు గల్లంతు కాకూడదు:**

గ్రామాల్లో, వార్డుల్లో నివసిస్తున్న అర్హులైన పేద ప్రజల, యువతీ యువకుల ఓట్లు ఏ ఒక్కటి కూడా జాబితా నుండి గల్లంతు కాకుండా బీఎల్ఏలు నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరితో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయించాలి. చనిపోయిన వారి ఓట్లు, ఊర్లో లేని వారి దొంగ ఓట్లపై నిశితంగా నిఘా ఉంచాలి. ప్రతి బూత్ పరిధిలో పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందేలా అధికారులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ ఓటర్ల పరిశీలన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు, వార్డు ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, సోషల్ మీడియా నిర్వాహకులు మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


## పాల ప్యాకెట్ పై రూ. 5, కూల్ డ్రింక్‌లపై రూ. 10 అదనపు వసూళ్లు.. ఎమ్మార్పీ (MRP) కి మంగళం!




ఒక షాపులో Expiry అయిన కూల్ డ్రింక్ విక్రయం



చేర్యాలలో షాపుల ముందు చెట్ల కుప్పలు




ఈ నెల 25వ తేదీన చేర్యాల మార్కెట్ లో ఒక షాప్ లో పాలు పెరుగు ప్యాకెట్ లకు 94 రూపాయలు తీసుకున్న వైనం ( MRP 84)

**-చేర్యాలకు 'ఫుడ్ సేఫ్టీ' అధికారులు లేరా..?**

**-థియేటర్ సమీపంలో ఒక షాప్ లో కాలం ముగిసిన (Expired) కూల్ డ్రింక్ అమ్మకంతో కష్టమర్ల అస్వస్థత**

**-రాష్ట్రంలో 'కాంగ్రెస్'.. చేర్యాలలో 'బీఆర్ఎస్' పాలన.. రాజకీయ రొంపిలో నలిగిపోతున్న చేర్యాల అభివృద్ధి!**

**చేర్యాల (హిందూస్తాన్ మీడియా):** "చేర్యాల మున్సిపాలిటీ పరిధి అసలు ఎవరి కిందకు వస్తుంది? ఇక్కడి ప్రజల ప్రాణాలకు, జేబులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఏ అధికారులది ?"---ఇప్పుడు చేర్యాల పట్టణ నడిబొడ్డున సామాన్య ప్రజల నుండి వినబడుతున్న పదునైన ప్రశ్నలివి. సిద్దిపేట జిల్లాలో ఉంటూ, జనగామ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే చేర్యాల మున్సిపాలిటీ ఇప్పుడు అధికారుల నిర్లక్ష్యానికి, సరిహద్దుల లొసుగులకు ఒక కేరాఫ్ అడ్రస్‌గా మారింది. సిద్దిపేట జిల్లా అధికారులు 'మాకేంటి' అని, జనగామ అధికారులు 'మా పరిధి కాదంటూ' ఎవరికి వారే సైలెంట్ అయిపోవడంతో, చేర్యాలలో వ్యాపారుల అక్రమ దోపిడీ, హోటళ్ల యజమానుల ఇష్టారాజ్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

**-ఎమ్మార్పీ (MRP) ఉల్లంఘన.. లిఅడిగితేనే ఒక న్యాయం.. అడగకుంటే మరో న్యాయమా?**

గత కొన్ని రోజులుగా చేర్యాల పట్టణంలో ఎమ్మార్పీ ధరల ఉల్లంఘన విపరీతంగా పెరిగిపోయింది. దీనిపై స్థానిక వినియోగదారులు నెత్తీనోరూ బాదుకుంటున్నా ఇటు మున్సిపల్ సిబ్బంది గానీ, అటు ఫుడ్ సేఫ్టీ అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదు. పాల ప్యాకెట్ల దోపిడీ: ప్రతి నిత్యం ప్రతి ఇంటా వాడే పాల ప్యాకెట్లపై కనీసం మూడు నుండి ఐదు రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇటీవల ఒక షాపులో ఓ వినియోగదారుడు పాల ప్యాకెట్‌కు మూడు రూపాయలు ఎక్కువ తీసుకోవడంపై నిలదీసి ప్రశ్నించడంతో.. సదరు దుకాణదారుడు అప్పటినుండి ఎమ్మార్పీ ధరకే ఇస్తున్నాడు. కానీ మిగతా షాపుల వారు మాత్రం 'మాకేంటి భయం' అన్నట్లు అందరి వద్ద యథేచ్ఛగా అధిక ధరలకే విక్రయిస్తూ పగటి దొంగతనానికి పాల్పడుతున్నారు. కూల్ డ్రింక్స్ ఢ వాటర్ బాటిల్స్: ఎండ తీవ్రతను బట్టి కూల్ డ్రింక్స్, ప్యాకేజ్డ్ వాటర్ బాటిళ్లపై రూ. 5 నుండి రూ. 10 వరకు అడ్డగోలుగా వసూలు చేస్తూ సామాన్యుడి జేబుకు పెద్ద చిల్లు పెడుతున్నారు.

**-ప్రాణాలతో చెలగాటం: థియేటర్ వద్ద 'ఎక్స్‌పైరీ' కూల్ డ్రింక్స్ కలకలం!**

?అధిక ధరల దోపిడీ ఒకెత్తయితే, కుళ్లిన ఆహార పదార్థాలు, గడువు ముగిసిన పానీయాలు అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం మరో ఎత్తు. ఇటీవల చేర్యాల ముస్త్యాల రోడ్డు వైపు ఉన్న సినిమా థియేటర్ సమీపంలోని ఒక దుకాణంలో ఓ వినియోగదారుడు కూల్ డ్రింక్ కొనుగోలు చేశాడు. నిర్వాహకులు ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేటు వసూలు చేయడమే కాకుండా.. ఏకంగా కాలం ముగిసిన (Expired) కూల్ డ్రింక్‌ను కస్టమర్‌కు అంటగట్టారు. అది గమనించకుండా తాగిన పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇదేమిటని సదరు బాధిత వినియోగదారుడు సదరు దుకాణదారుడిని ప్రశ్నించగా, కనీస పశ్చాత్తాపం లేకుండా అత్యంత నిర్లక్ష్యంగా, దురుసుగా సమాధానం ఇవ్వడం పట్టణంలో కలకలం రేపింది. ఇలా రోజుకో ప్రమాదకర సంఘటన జరుగుతున్నా విక్రయదారులపై ఎలాంటి చర్యలు లేకపోవడం అధికారుల అసమర్థతకు పరాకాష్ట.

**-కల్తీ నూనెలు.. కుళ్లిన తిండ్లు.. ఎక్కడున్నారు సేఫ్టీ అధికారులు?**

?మరోవైపు చేర్యాలలోని మెజారిటీ హోటళ్లు, టిఫిన్ సెంటర్లు కనీస పరిశుభ్రత లేకుండా నడుస్తున్నాయి. ఒక్కసారి వాడిన వంట నూనెను (Repeatedly Used Oil) పదే పదే వేడి చేస్తూ విషపూరితంగా మార్చి, దాంతోనే బజ్జీలు, సమోసాలు, టిఫిన్లు వండుతూ ప్రజలకు రోగాలను పంచుతున్నారు. లంచాలకు అలవాటు పడ్డారో లేక నిద్రమత్తులో ఉన్నారో తెలియదు కానీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎప్పుడో ఒకసారి వచ్చి ఏదో ఒక హోటల్‌పై నామమాత్రపు జరిమానా వేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప, నిరంతర తనిఖీలు చేసిన దాఖలాలు లేవు.

**-మున్సిపల్ పాలకవర్గం.. కాగితాలకే పరిమితమైన తీర్మానాలు!**

?అధికారుల పరిస్థితి ఇలా ఉంటే, స్థానిక మున్సిపల్ పాలకవర్గం, సిబ్బంది తీరు మరింత అధ్వానంగా తయారైంది. ఫుట్‌పాత్‌లపై అక్రమంగా వెలిసిన బండ్లను, షాపులను తొలగించాలని మున్సిపల్ కౌన్సిల్‌లో ఘనంగా తీర్మానం చేశారు. కానీ ఆ తీర్మానం కాగితాలకే పరిమితమైంది తప్ప ఆచరణలోకి రాలేదు. పట్టణంలో షాపుల ముందు చెట్లను నరికివేసి పది రోజులు దాటుతున్నా, రోడ్ల పక్కన కుప్పలు కుప్పలుగా అలాగే ఉంచారు. మున్సిపల్ సిబ్బందిని అడిగితే కనీసం సమాధానం చెప్పే నాథుడే లేడు. పాలకవర్గం ఏర్పడి ఇన్ని నెలలైనా కనీసం పాలనపై పట్టు సాధించలేకపోవడం విచారకరం.

**-రాజకీయ పంతాలు.. చేర్యాలకు శాపాలు!**

?రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటే, చేర్యాల మున్సిపాలిటీలో మాత్రం బీఆర్ఎస్ పాలకవర్గం అధికారంలో ఉంది. ఈ రెండు వేర్వేరు నౌకల వంటి ప్రభుత్వాల మధ్య ఉన్న రాజకీయ పంతాల వల్లనే రాష్ట్ర ప్రభుత్వం చేర్యాలను చిన్నచూపు చూస్తోందా? లేక స్థానిక నాయకులే మాకేంటని ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు సైలెంట్ గా ఉంటున్నారా? అని ప్రజలు అనుమానిస్తున్నారు. ?చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితి, విద్యా సంస్థల ఇబ్బందులు, మార్కెట్ యార్డ్‌లో షట్టర్ల నిర్మాణం కాకపోవడం వంటి అనేక సమస్యలపై స్థానిక యువత, ప్రజలు నిరంతరం సోషల్ మీడియా, వాట్సాప్ ల ద్వారా ఫోటోలతో సహా సాక్ష్యాలు పంపుతున్నా పాలకవర్గంలో కదలిక లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిద్రమత్తు వీడి చేర్యాల మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్స్‌పైరీ ప్రొడక్ట్స్ అమ్ముతున్న బ్లాక్ మార్కెట్ కేటుగాళ్లపై, కల్తీ హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ శాఖ, లీగల్ మెట్రాలజీ, మున్సిపల్ అధికారాలు సమన్వయంతో పనిచేసి,కఠిన చర్యలు తీసుకోవాలని చేర్యాల ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

## చెట్ల కొమ్మల తొలగింపులో నిర్లక్ష్యం.. ప్రజలకు ఇబ్బందులు

**-"కరెంట్ శాఖ నరికింది.. మేం తీయం" అంటూ మున్సిపల్ కమిషనర్ సమాధానం ఇచ్చారని స్థానికుల ఆవేదన**

**-15 రోజులుగా షాపు ముందు పేరుకుపోయిన చెట్ల కొమ్మలు.. వెంటనే తొలగించాలని డిమాండ్**



**చేర్యాల, జూన్ 26 (హిందుస్థాన్ మీడియా):** సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో ఒక షాపు ముందు గత 15 రోజులుగా నరికిన చెట్ల కొమ్మలు అలాగే ఉండిపోవడంతో స్థానిక వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డుగా వస్తున్నాయని విద్యుత్ శాఖ సిబ్బంది వాటిని నరికి అక్కడే వదిలివెళ్లారు. అయితే రెండు వారాలు గడిచినా వాటిని తొలగించకపోవడంతో షాపు ముందు చెత్త పేరుకుపోయి వ్యాపార కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోందని తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి చెట్ల కొమ్మలు తొలగించాలని కోరగా, "వాటిని విద్యుత్ శాఖ వారు నరికారు.. మాకు సంబంధం లేదు.. మేము తొలగించం" అనే సమాధానం వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ శాఖ నరికినా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా వెంటనే చెట్ల కొమ్మలను తొలగించే బాధ్యత సంబంధిత అధికారులు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటనపై మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సమస్యను తక్షణమే పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బిజినెస్

## రెండో రోజు లాభాల్లోనే




ముంబై:
అంతర్జాతీయ మార్కెట్లో తగ్గుతున్న ముడి చమురు ధరలు, ప్రపంచ మార్కెట్లలో ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ పెరిగి దేశీయ ప్రామాణిక సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా రెండో రోజూ లాభాలను నమోదు చేశాయి. గురువారం బీఎ సఈ సెన్సెక్స్ 109.25 పాయింట్లు పెరిగి 77,100.47 వద్ద ముగిసింది. ఎన్ఎ?సఈ నిఫ్టీ 34.35 పాయింట్ల లాభంతో 24,056 వద్ద క్లోజైంది. ఆటో, ఏవియేషన్, బ్యాంకింగ్ షేర్లు లాభపడ్డాయి. సెన్సెక్స్‌లో 19 షేర్లు నష్టపోగా 11 షేర్లు పెరిగాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 811.96 పాయింట్లు పెరిగి దే గరిష్ఠ స్థాయి 77803.18ని తాకింది. అయితే ఐటీ, మెటల్ షేర్లలో లాభాల స్వీకరణ కారణంగా ద్వితీయార్ధంలో లాభాలు తగ్గిపోయాయి. నేడు మార్కెట్లు పని చేయవు: మొహర్రం సందర్భంగా శుక్రవారం స్టాక్, మనీ, కమోడిటీస్ మార్కెట్లు పని చేయవు.

## వెనెజువెలాలో భారీ భూకంపాలు-భారత్‌కు సమస్యలు తప్పవా




వెనెజువెలాలో ఇటీవల సంభవించిన రెండు భారీ భూకంపాలు అక్కడి ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయి. ఒక్క నిమిషం వ్యవధిలో రెండు తీవ్ర భూకంపాలు రావడంతో భారీ ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించాయి. ఈ భూకంపాల ప్రభావం వెనెజువెలాకు 14 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భారత్‌పై కూడా తీవ్రంగా పడనుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారుఇటీవలి కాలంలో వెనెజువెలా నుంచి భారత్ చమురు దిగుమతులను గణనీయంగా పెంచింది. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో భారత చమురు శుద్ధి సంస్థలు ఇటీవల వెనెజువెలా నుంచి ముడి చమురు కొనుగోళ్లను పెంచాయి. ఏప్రిల్, మే నెలల్లో భారత్‌కు ప్రధాన చమురు సరఫరాదారుల్లో ఒకటిగా వెనెజువెలా ఎదిగింది. ఈ పరిస్థితుల్లో భూకంపం వల్ల అక్కడి ఎగుమతి వ్యవస్థకు అంతరాయం కలిగితే భారత్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. భూకంపం కారణంగా వెనెజువెలా నౌకాశ్రయాల కార్యకలాపాలు దెబ్బతినడం, విద్యుత్ అంతరాయాలు, రవాణా వ్యవస్థలో సమస్యలు, అత్యవసర ఆంక్షలు అమలులోకి రావడం వల్ల చమురు ట్యాంకర్ల రాకపోకలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీంతో సరుకు రవాణా ఖర్చులు, బీమా ప్రీమియంలు, నౌకల నిరీక్షణ వ్యయాలు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. భారత ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ విదేశ్‌కు వెనెజువెలా చమురు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు ఉన్నాయి. భూకంప ప్రభావం ఎక్కువకాలం కొనసాగితే ఆ పెట్టుబడుల నిర్వహణ, ఉత్పత్తి కార్యకలాపాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

## టర్బో పెట్రోల్, అడుగు భాగంలో సీఎన్‌జీ సిలిండర్ మారుతి బ్రెజ్జా సరికొత్తగా



మారుతి సుజుకి తన అత్యంత ప్రజాదరణ పొందిన ఎస్‌యూవీ బ్రెజ్జాను సరికొత్తగా తీర్చిదిద్దుతోంది. దీన్ని త్వరలోనే భారత మార్కెట్లో విడుదల చేయనుంది. అధికారిక ప్రకటన రాకపోయినా టెస్టింగ్ సందర్భంగా పలుసార్లు కనిపించిన ఈ వాహనంలో డిజైన్‌తో పాటు ఇంజిన్, ఫీచర్లలో కీలక మార్పులు ఉండనున్నట్లు తెలుస్తోంది. కొత్త బ్రెజ్జాలో ప్రస్తుతం ఉన్న 1.5 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్‌తో పాటు 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ కూడా అందుబాటులోకి రానుంది. ఇదే ఇంజిన్‌ను ప్రస్తుతం ఫ్రాంక్స్‌లో ఉపయోగిస్తున్నారు. దీన్ని బ్రెజ్జా కోసం మరింత శక్తిమంతంగా ట్యూన్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. సీఎన్‌జీ వేరియంట్‌లో కూడా పెద్ద మార్పు తీసుకురానున్నట్లు సమాచారం. సిలిండర్‌ను బూట్ స్పేస్‌లో కాకుండా వాహనం అడుగు భాగంలో అమర్చనున్నారు. దీంతో లగేజీ పెట్టుకునేందుకు మరింత స్థలం లభిస్తుంది. ఫీచర్ల పరంగా వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇవి టాప్ వేరియంట్లలో అందుబాటులో ఉండే అవకాశం ఉంది. అలాగే పవర్ అడ్జస్టబుల్ ఫ్రంట్ సీట్లు కూడా తొలిసారిగా బ్రెజ్జాలో ఇవ్వనున్నట్లు సమాచారం.

## వరల్డ్ నం.1 బౌలర్ కావడంపై స్పందించిన శ్రీ చరణి

స్పోర్ట్స్ డెస్క్:
ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్2026లో సరికొత్త రికార్డులతో భారత్ స్టార్ స్పిన్నర్ శ్రీ చరణి దూసుకుపోతుంది. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్ మండలి ప్రకటించిన టీ20 ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్ వన్ బౌలర్‌గా అవతరించిన విషయం తెలిసిందే. దీనిపై శ్రీ చరణి స్పందిస్తూ.. ప్రస్తుతానికి తన దృష్టంతా ప్రపంచకప్ గెలవడం పైనే ఉందని స్పష్టం చేసింది. ఒకే ప్రపంచకప్ ఎడిషన్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఆమె(12*) సరికొత్త చరిత్ర సృష్టించింది. ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో షోర్ణా అక్తర్ వికెట్ తీయడం ద్వారా శ్రీ చరణి ఈ టోర్నీలో తన 11వ వికెట్‌ను ఖాతాలో వేసుకుంది. తద్వారా 2020 ప్రపంచ కప్‌లో పూనమ్ యాదవ్ (10 వికెట్లు) పేరిట ఉన్న భారత రికార్డును ఈ 21 ఏళ్ల యువ స్పిన్నర్ బద్దలు కొట్టింది. ఈ సందర్భంగా ఓతో ఆమె మాట్లాడుతూ.. 'ప్రస్తుతం నా దృష్టి పూర్తిగా ప్రపంచకప్‌పైనే ఉంది. వ్యక్తిగత ర్యాంకింగ్స్ సంతోషాన్ని ఇస్తాయి, కానీ అవి నా ప్రాధాన్యత కాదు. సరైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేస్తూ జట్టుకు విజయాన్ని అందించడమే నా కర్తవ్యం' అని పేర్కొంది. బంగ్లాదేశ్ మ్యాచ్‌లో తన బౌలింగ్‌లో మూడు క్యాచ్‌లు చేజారినప్పటికీ ఒత్తిడికి లోనవ్వలేదని, క్యాచ్‌లు జారడం ఆటలో భాగమేనని పరిణతితో కూడిన సమాధానమిచ్చింది. షఫాలీ వర్మ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో బంగ్లాదేశ్‌పై గెలిచిన భారత్, గ్రూప్-ఎలో రెండో స్థానంలో నిలిచి సెమీస్ అవకాశాలను మెరుగుపరుచుకుంది. తదుపరి జరగబోయే ఆస్ట్రేలియా మ్యాచ్ అత్యంత కీలకమైనదని, అయితే తాము ఎలాంటి అదనపు ఒత్తిడి లేకుండా ఎప్పటిలాగే ప్రణాళికలను పక్కాగా అమలు చేస్తామని చరణి ధీమా వ్యక్తం చేసింది.




## నెట్స్‌లో సీనియర్లను వణికించేస్తున్న వైభవ్- వీడియో వైరల్

స్పోర్ట్స్ డెస్క్:
భారత క్రికెట్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంపై ఉత్కంఠ కొనసాగుతోంది. కోచింగ్ సిబ్బంది నుంచి కూడా స్పష్టత రాలేదు. కానీ, తాజాగా బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పెట్టిన వీడియో మాత్రం క్రికెట్ ప్రియులను ఖుషీ చేస్తోంది. ఆ వీడియోతో వైభవ్ డెబ్యూ చేయడం ఖాయమనే భరోసా ఫ్యాన్స్‌కు వచ్చింది. మరి.. బీసీసీఐ రిలీజ్ చేసిన ఆ వీడియో ఏమిటో ఇప్పుడు చూద్దాం...బీసీసీఐ విడుదల చేసిన వీడియోలో నెట్స్‌లో సీనియర్ బౌలర్ల బౌలింగ్‌లో వైభవ్ భారీ షాట్లు కొడుతున్నాడు. ప్రత్యేకించి అతను ఆడుతున్న 'నో-లుక్ షాట్' అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. వైభవ్ ప్రాక్టీస్ వీడియోలు ఏకంగా బీసీసీఐనే పోస్టు చేయడంతో ఇవాల్టి మ్యాచ్‌లో అతడి అరంగేట్రం ఖాయమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఒకవేళ అతడిని ఎంపిక చేస్తే.. ఎవరిని పక్కన పెడతారనేది ఆసక్తికరంగా మారింది. కాగా, ఈ సంచలన ఆటగాడిపై ఐర్లాండ్ వికెట్ కీపర్ బెన్ కాలిట్జ్ స్పందిస్తూ.. 'మాతో ఎవరు ఆడినా ఒకేలా చూస్తాం. విరాట్ కోహ్లీనా.. శ్రేయస్ అయ్యరా.. లేదా సూర్యవంశీనా అనే సంగతి పక్కన పెడతాం. ప్రతి ఒక్కరితోనూ మెరుగైన క్రికెట్ ఆడేందుకు మాత్రమే ప్రయత్నిస్తాం. వారి ఆటతీరును నిశితంగా గమనించి.. అందుకు తగినట్లుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. మ్యాచ్ సమయంలోనూ వ్యూహాలు మారిపోతూ ఉంటాయి. టీమిండియా ప్రపంచ ఛాంపియన్ జట్టు. కానీ, వారిలోనూ కొన్ని బలహీనతలు ఉంటాయి. వాటిని ఆసరా చేసుకొని విజయం సాధించేందుకు ప్రయత్నిస్తాం' అని కాలిట్జ్ వ్యాఖ్యానించాడు.



# స్పోర్ట్స్

## ఇంగ్లండ్ టూర్ కు టీమిండియా ఎంపిక పై రవిశాస్త్రి ఏమన్నాడంటే...!



ఇంగ్లండ్‌తో జరగనున్న వైట్-బాల్ సిరీస్ కోసం ప్రకటించిన భారత జట్టు యువత, అనుభవం కలబోతతో ఆదర్శవంతంగా ఉందని టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి విశ్వాసం వ్యక్తం చేశాడు. సవాలుతో కూడిన ఇంగ్లీష్ పరిస్థితుల్లో రాణించే సత్తా ఈ జట్టుకు ఉందని ధీమాగా చెప్పాడు. త్వరలో జరగనున్న ఈ పర్యటన నేపథ్యంలో, టీ20 జట్టుకు నాయకత్వం వహిస్తున్న శ్రేయస్ అయ్యర్ పై శాస్త్రి ప్రశంసలు కురిపించాడు. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌తో మాట్లాడుతూ, "ఈ కొత్త భారత జట్టులో యువత, అనుభవం అద్భుతంగా మేళవించాయి. టీ20 క్రికెట్‌లో శ్రేయస్ అయ్యర్ బలమైన ఆటగాడు. అతనికి కెప్టెన్సీ ఇవ్వడం నాకు ఆనందంగా ఉంది. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, రవి బిష్ణోయ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి యువ ఆటగాళ్ల నుంచి అద్భుత ప్రదర్శనలు ఆశిస్తున్నాను" అని శాస్త్రి తెలిపాడు. ఇక టీ20 జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా, తిలక్ వర్మ వైస్-కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ జట్టులో అభిషేక్ శర్మ, రవి బిష్ణోయ్, ప్రసిద్ధ్ కృష్ణ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, హర్షిత్ రాణా, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ వంటి వారికి చోటు దక్కింది. మరోవైపు, వన్డే జట్టులోకి సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా తిరిగి వచ్చారు. తొడ కండరాల గాయం నుంచి కోలుకున్న కోహ్లీ ఈ సిరీస్‌తో పునరాగమనం చేయనుండగా, బుమ్రా పేస్ విభాగానికి నాయకత్వం వహిస్తాడు.

# 'బాహుబలి 3' వస్తుందా? ప్రభాస్, రానా, అనుష్క హింట్‌తో అభిమానుల్లో జోష్

**-'బాహుబలి 3'పై మళ్లీ మొదలైన ఊహాగానాలు**
**-డాక్యుమెంటరీలో మూడు వేళ్లు చూపిన ప్రభాస్**
**-రానా వ్యాఖ్యలు, అనుష్క స్పందన వైరల్**
**-'అండ్ ది లెగసీ కంటిన్యూస్' సందేశంతో పెరిగిన ఆసక్తి**
**-అధికారిక ప్రకటన మాత్రం ఇంకా చేయని రాజమౌళి బృందం**



'బాహుబలి 3'పై మళ్లీ చర్చ మొదలైంది. తాజాగా విడుదలైన 'బాహుబలి: ది టార్చ్‌బేరర్' డాక్యుమెంటరీ లో ప్రభాస్, రానా దగ్గుబాటి, అనుష్క శెట్టి చేసిన వ్యాఖ్యలు, ఎక్స్‌ప్రెషన్స్ మూడో భాగం రానుందనే సంకేతాలుగా అభిమానులు భావిస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్ లో విడుదలైన 'బాహుబలి: ది టార్చ్‌బేరర్' డాక్యుమెంటరీ లో రానా దగ్గుబాటి మాట్లాడుతూ "ప్రపంచం ఇంకా సిద్ధంగా లేకపోవచ్చు. కానీ బాహుబలి.." అని చెప్పగా, వెంటనే ప్రభాస్ మూడు వేళ్లు చూపిస్తూ చిరునవ్వు చిందించాడు. పక్కనే ఉన్న అనుష్క శెట్టి కూడా నవ్వడంతో ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చివర్లో 'అండ్ ది లెగసీ కంటిన్యూస్' అనే సందేశం కనిపించడం మరింత ఆసక్తిని పెంచింది. ఈ క్లిప్‌ను చూసిన అభిమానులు 'బాహుబలి 3 అధికారికంగా వస్తోంది' అంటూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. అయితే దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి గానీ, చిత్ర బృందం గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మరోవైపు 'బాహుబలి: ది టార్చ్‌బేరర్' నాలుగు భాగాల డాక్యుమెంటరీ జూన్ 26 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది. బాహుబలి చిత్రాల నిర్మాణం, వాటి వెనుక కథలు, ప్రపంచవ్యాప్తంగా సాధించిన విజయాలను ఇందులో చూపించారు. 2015లో విడుదలైన 'బాహుబలి: ది బిగినింగ్', 2017లో వచ్చిన 'బాహుబలి: ది కన్‌క్లూజన్' భారతీయ సినీ చరిత్రలో సంచలన విజయాలు సాధించాయి. ప్రభాస్‌ను పాన్ ఇండియా స్టార్‌గా నిలబెట్టిన ఈ ఫ్రాంచైజీకి ఇప్పటికీ భారీ అభిమాన వర్గం ఉంది. ఇప్పుడు మూడో భాగంపై వస్తున్న సంకేతాలు అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

## సమంత గర్భవతి అనే విషయం నాకు మాత్రమే తెలుసు: నందినీ రెడ్డి



స్టార్ హీరోయిన్ సమంత, డైరెక్టర్ నందిని రెడ్డి కాంబినేషన్‌కు టాలీవుడ్‌లో ఎంతటి క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 'జబర్దస్త్', 'ఓ బేబీ' సినిమాల తర్వాత వీరిద్దరి కాంబోలో వచ్చిన 'మా ఇంటి బంగారం సినిమా' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు. ఆ ఎదురు చూపులకు తగ్గట్టుగానే ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి పాజిటివ్ టాక్ తో దూసుకుపోతోంది. తాజాగా ఓ పాడ్‌కాస్ట్ షోలో పాల్గొన్న నందిని రెడ్డి.. సమంత ప్రెగ్నెన్సీ గురించి ఆసక్తికరమైన విషయాలు బయట పెట్టారు. ఎన్టీవీ పాడ్‌కాస్ట్ షోలో నందిని రెడ్డి మాట్లాడుతూ... సినిమా షూటింగ్ సమయంలో జరిగిన సీక్రెట్‌ను షేర్ చేసుకున్నారు. "మా ఇంటి బంగారం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సమయంలోనే.. సమంత గర్భవతి అయిందనే విషయం తెలిసింది. ఆ టైమ్‌లో ఆ గుడ్ న్యూస్ సెట్‌లో ఒక్క నాకు మాత్రమే తెలుసు. వేరే ఎవరికీ ఈ విషయం లీక్ కాకుండా జాగ్రత్త పడ్డాం" అని తెలిపారు. "లక్కీగా అప్పటికే చిత్రానికి సంబంధించిన హెవీ యాక్షన్ సీక్వెన్స్‌లు మొత్తం కంప్లీట్ చేసేశాం. దాంతో పెద్దగా ఇబ్బంది పడలేదు. కానీ ఆ తర్వాత మిగిలిన షూటింగ్ పార్ట్ మొత్తం సమంత హెల్త్‌ను దృష్టిలో పెట్టుకుని ప్లాన్ చేశాం. ఆమెకు ఎక్కడా స్ట్రెయిన్ అవ్వకుండా, కొంచెం ఎక్కువ రెస్ట్ ఇస్తూనే మిగతా షూటింగ్‌ను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేశాం" అని నందిని రెడ్డి చెప్పుకొచ్చారు.


## కెరీర్ ప్రారంభంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను: కృతి సనన్



కృతి సనన్ ఇటీవల 'కాక్‌టెయిల్-2'తో బాలీవుడ్‌లో భారీ హిట్ సాధించింది. ప్రస్తుతం తెలుగు సినిమా పరిశ్రమ నుంచి బంపర్ ఆఫర్ అందుకుంది. విజయ్ దేవరకొండ, శౌర్యవ్‌తో కలిసి పాన్ ఇండియా స్థాయి చిత్రంలో కీలక పాత్రలో నటించనుందనే వార్త హల్‌చల్ చేస్తోంది. మరోవైపు, ఓ ఇంటర్వ్యూలో కృతి తన 12 ఏళ్ల సినిమా ప్రయాణం గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యింది. "ప్రారం భంలో చాలా కష్టాలు పడ్డాను. మోడలింగ్ రోజుల్లో నా మొదటి ఫొటో షూట్, మొదటి ర్యాంప్ వాక్ రెండూ పూర్తిగా ఫ్లాప్ అయ్యాయి. ఇంటికి వెళ్లి ఏడ్చాను. కానీ ఆపకుండా మళ్లీ ఆడిషన్లు చేశాను. ఆ పట్టుదలే నన్ను ఇక్కడి వరకు తీసుకొచ్చింది" అని గుర్తు చేసుకుంది. అంతేకాదు, బాలీవుడ్‌లోని నెపోటిజం పైనా కృతి తీవ్రంగా స్పందించింది. రణ్‌బీర్ కపూర్, అలియా భట్ లాంటి స్టార్ కిడ్స్ లో టాలెంట్ ఉందని, కష్టపడి నిరూపించుకున్నారని చెప్పిన కృతి... టాలెంట్ లేని కొందరు కేవలం ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ కారణంగా 8-9 ఏళ్ల పాటు వరుసగా అవకాశాలు పొందడం అన్యాయమని మండిపడింది. బ్యాక్‌గ్రౌండ్ లేని నటీనటులు మొదటి 2-3 ఏళ్లలోనే హిట్‌లు కొట్టకపోతే ఇండస్ట్రీ వారిని పక్కకు నెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## విజయ్ 6 కారవాన్లు, 50 మంది అసిస్టెంట్లను అడిగాడనేది ఫేక్: మైత్రి రవిశంకర్

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ తాజా చిత్రం 'రణబాలి' చుట్టూ సోషల్ మీడియాలో పుకారు చక్కర్లు కొడుతోంది. షూటింగ్ సెట్స్‌లో విజయ్ హద్దు దాటి ప్రవర్తిస్తున్నాడని, తన కోసం ఏకంగా 5 నుండి 6 కారవాన్లు, 40-50 మంది అసిస్టెంట్లను డిమాండ్ చేశాడంటూ ప్రచారం జరుగుతోంది. అంతేకాదు, ఈ ఖర్చు భరించలేక నిర్మాతలు 'ప్రొడ్యూసర్స్ కౌన్సిల్'ను ఆశ్రయించారనే వార్తలు కూడా వైరల్ అయ్యాయి. ఈ తప్పుడు ప్రచారంపై చిత్ర నిర్మాత, మైత్రి మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్ మీడియా ద్వారా స్పందించారు. విజయ్ దేవరకొండ అత్యంత ప్రొఫెషనల్‌గా వ్యవహరించే హీరో అని. షూటింగ్‌లో ఇప్పటివరకు ఎలాంటి సమస్యలు తలెత్తలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ వార్తలన్నీ కేవలం కొందరు కావాలనే క్రియేట్ చేసినవని చెప్పారు. అటు విజయ్ పీఆర్ టీమ్ కూడా ఈ రూమర్లను సృష్టించిన బాధ్యులపై సైబర్ క్రైమ్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చింది. ఇక రూమర్ల సంగతి పక్కనబెడితే.. 'రణబాలి' సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు ఉన్నాయి. 'శ్యామ్ సింగరాయ్' ఫేమ్ రాహుల్ సాంకృత్యాయన్ డైరెక్షన్‌లో... 1854 నుంచి 1878 మధ్య కాలంలో బ్రిటిష్ పాలన నాటి వాస్తవ చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ పీరియడ్ డ్రామా తెరకెక్కుతోంది. బ్లాక్ బస్టర్ హాలీవుడ్ మూవీ 'ది మమ్మీ' విలన్, నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఇందులో మెయిన్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరసన ఆయన భార్య రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తోంది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' చిత్రాల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా ఇది. అంతేకాదు, వీరిద్దరి వివాహం జరిగిన తర్వాత స్క్రీన్ షేర్ చేసుకుంటున్న మొదటి ప్రాజెక్ట్ ఇదే కావడం వల్ల ఫ్యాన్స్‌లో ఈ కాంబో క్రేజ్ నెక్స్ట్ లెవెల్‌కు వెళ్ళింది.




## 'తుక్రా కే మేరా ప్యార్ 2' మూవీ రివ్యూ!

హిందీ నుంచి వచ్చిన డ్రామా సిరీస్ లలో 'తుక్రా కే మేరా ప్యార్' సిరీస్ కి ప్రత్యేకమైన స్థానం ఉంది. సంచితా బసు – ధవళ్ ఠాకూర్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ మొదటి సీజన్ కి విశేషమైన స్పందన లభించింది. ఆర్థికపరమైన అంతరం ఇద్దరు ప్రేమికులను ఎలా విడదీసింది? వాళ్ల మధ్య శత్రుత్వానికి ఎలా కారణమైంది? అనే అంశం చుట్టూ అల్లుకున్న కథ ఇది. నటన పరంగా సంచితా బసుకి మంచి మార్కులు పడిపోయాయి. అలాంటి ఈ సిరీస్ నుంచి సీజన్ 2 రూపొందింది. ఈ నెల 19వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. సీజన్ 2 నుంచి ముందుగా 4 ఎపిసోడ్స్ ను వదిలారు. కుల్దీప్ కుమార్ (ధవళ్ ఠాకూర్) శాన్వీక చౌహన్ (సంచిత బసు) ప్రేమించుకుంటారు. డబ్బు .. పిలుకుబడి ఉన్న మనోహర్ సింగ్, వాళ్ల ప్రేమను తిరస్కరిస్తాడు. ఆయన కారణంగా కుల్దీప్ కి ప్రమాదం ఉందని భావించిన శాన్వీక, కుల్దీప్ కుమార్ మనసు విరిగిపోయేలా చేస్తుంది. ఆ కసితోనే అతను కలెక్టర్ అవుతాడు. తన అధికారాలను ఉపయోగించి శాన్వీక కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలనుకుంటాడు. అయితే రాజకీయ పరమైన ముఠాపరమైన కక్షల కారణంగా శాన్వీక తన తండ్రిని భర్తను కోల్పోతుంది. ఈ సంఘటనలలో కుల్దీప్ హస్తం ఉందని ఆమె అపార్థం చేసుకుంటుంది. శాన్వీక తన తండ్రి స్థానంలో రాజకీయాలలో ముందుకు దూసుకు వెళుతుంటుంది. 'సితారా పూర్' ప్రజలంతా ఆమెను ఎంతగానో అభిమానిస్తూ ఉంటారు. శాన్వీకపై మనసు పారేసుకున్న 'కున్వర్' ఆమెకి



సహాయం చేస్తున్నట్టుగా నటిస్తూ, చేరువ కావడానికి ప్రయత్నిస్తుంటాడు. అతని ఉద్దేశాన్ని అర్థం చేసుకున్న శాన్వీక, నమ్మినట్టుగా నటిస్తుంటుంది. ఇక శాన్వీక కారణంగా తన కూతురు జీవితం ప్రమాదంలో పడుతుందని భావించిన దద్దూ మహారాజ్, ఆమెకి హాని తలపెట్టడానికి సన్నాహాలు మొదలుపెడతాడు.




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455